AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

ప్రయోగంతో గణితం సులభం

2

2

ఘనంగా రైతు దినోత్సవం

ఆర్మూర్ అభివృద్ధి పనులకు నిధులివ్వాలి

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు బాగా లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనుల కోసం నిధులు ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఎంతో మంది గ్రామీణులకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని.. ఇందులో భాగంగానే గాంధీ పేరు తొలగించిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గాంధీ చౌక్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తొలగించాలని చూస్తోందని ఆరోపించారు. హెర్ బిన్ హందాన్, సహకార కార్పొరేషన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తపస్ నూతన కార్యవర్గం ఎన్నిక

అక్షరటుడే, ఇందూరు: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విభాగ్ ఎన్నికల అధికారి శ్రీనివాస్ జిల్లా ఎన్నికల అధికారి రామకృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందూరు జిల్లా అధ్యక్షుడిగా నల్ల కిషన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డింగరి మధుసూదనాచారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యుడు, జోనల్ ఇన్‌ఛార్జి రవీంద్రనాథ్ ఆర్య, కీర్తి సుదర్శన్, ఆర్లగడ్డ రాఘవేందర్, శంకర్, మధుసూదన్, బద్రీనాథ్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లాలో పెద్దపులి సంచారం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. గత ఐదు నెలల క్రితం పెద్దపులి సంచరించగా.. ప్రస్తుతం మరోసారి దాని ఆనవాళ్లు కనిపిస్తుండడం కలకలం రేపుతోంది. అటవీ ప్రాంతాన్ని వదిలి మైదాన ప్రాంతాల్లో తిరుగుతుండడం, లేగ దూడలు, ఆవులపై దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో పెద్దపులి తనకు తోడును వెతుక్కోవడానికే వచ్చిందన్న ప్రచారం సాగుతోంది. - అక్షరటుడే, కామారెడ్డి

పెద్దపులి జాడ దొరికేనా?

■ జిల్లాలో సంచారంతో భయాందోళనలో ప్రజలు ■ ఐదు నెలల్లో రెండు సార్లు రావడంతో అధికారుల అలర్ట్ ■ సంరక్షణ కోసం చర్యలు

ఐదు నెలల కాలంలో పెద్దపులి రెండు సార్లు జిల్లాలో సంచరించడం కలకలం రేపుతోంది. మహారాష్ట్ర తాడోబా ప్రాంతం నుంచి లేదా మంచిర్యాల జిల్లా కవ్వాల్ ప్రాంతం నుంచి పెద్దపులి వచ్చినట్టుగా అధికారులు అనుమానిస్తున్నారు. అయితే మాచారెడ్డి, దోమకొండ, భిక్కనూర్ అటవీ రేంజ్ పరిధిలోనే పెద్ద పులి సంచరించడం వెనక ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఐదు నెలల క్రితం మాచారెడ్డి రేంజ్ పరిధిజీలో సంచరించిన పెద్దపులి ప్రస్తుతం దోమకొండ, భిక్కనూర్ మండలంలో సంచరిస్తుండటంతో ఈ ప్రాంతంలో పెద్దపులికి స్థావరం దొరికిందే మోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ట్రాక్ కెమెరాల ఏర్పాటు

జిల్లాలో పెద్దపులి ఏకంగా రెండోసారి సంచారంతో

అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. లేగ దూడలపై దాడి చేసింది పెద్దపులే అని నిర్ధారణ చేసుకున్న అధికారులు పులిని సంరక్షించే పనిలో పడ్డారు. పులి జాడ కనుక్కునేందుకు 9 ట్రాక్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రాక్ కెమెరాలో పులి కదలికలు రికార్డు కావడంతో పులి కదలికలపై నిఘా పెట్టారు. ఈ ప్రాంతంలో పులి తోడు దొరికిందని ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారం నేపథ్యంలో అధికారులు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పులికి ఎలాంటి హాని జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టుగా సమాచారం.

ప్రజలకు హెచ్చరికలు

పెద్దపులి సంచారం ఇటు అధికారులు, అటు శివారు ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. జిల్లాకు వచ్చిన పులిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకుంటుండగా పెద్దపులి వరుస దాడులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేరు వేరు ప్రాంతాలలో పెద్దపులి దాడులు జరుగుతుండటంతో పెద్దపులి ఒకటే ఉందా రెండు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పెద్దపులి సంచారం నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాల ప్రజలను అడవి వైపు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. పులికి హాని కలిగించే చర్యలకు పూనుకోవద్దని సూచిస్తున్నారు.

పెద్దపులి రక్షణ కోసం చర్యలు

జిల్లాలో పెద్దపులి సంచారం నిజమే. ఇప్పటికే పులి సంచారం నేపథ్యంలో ప్రజలను అలర్ట్ చేశాం. రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 9 ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేశాం. మూడు ప్రత్యేక బృందాలు పులి కోసం వెతుకుతున్నాయి. రెండు పులులు ఉన్నాయని డైరెక్ట్‌గా చూస్తే తప్ప చెప్పలేం.

- రామకృష్ణ, ఎఫ్‌డీవో కామారెడ్డి

యువత క్రీడలవైపు ఆకర్షితులవడం అభినందనీయం

అక్షరటుడే, బాన్సువాడ: యువత క్రీడలవైపు ఆకర్షితులవడం అభినందనీయమని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మోస్రా మండలం చింతకుంట గ్రామంలో చింతకుంట క్రికెట్ బోర్డు ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ టోర్నీని చింతకుంట క్రికెట్ బోర్డు ఛైర్మన్ ఎండీ ఆరీఫ్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ వంగ నీలిమ సాయ గౌడ్, ఇస్మాయిల్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రికెట్ బోర్డు సభ్యులను ఎమ్మెల్యే పోచారం అభినందించారు. అనంతరం ఇరు జట్ల కెప్టెన్ల సమక్షంలో టాస్ వేసి తొలి మ్యాచ్‌ను పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని ఆయన అన్నారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచే జట్టుకు రూ.33,333 నగదు బహుమతి, రెండో స్థానంలో నిలిచే జట్టుకు రూ. 15,555 నగదు బహుమతి అందజేస్తామని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి..

అక్షరటుడే, గాంధారి: జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీష్‌రావు, ప్రశాంత్ రెడ్డి సూచించారు. ఎల్లారెడ్డిలో పంచాయతీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సురేందర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తానాజీరావులు కలిసి మాజీ మంత్రులను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని అభినందించారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మరింత ఉత్సాహంతో పనిచేసి సత్తా చాటాలని సూచించారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని మార్చాలి

అక్షరటుడే, భీమ్‌గల్ : భీమ్‌గల్ తహశీల్దార్ కార్యాలయాన్ని తక్షణమే పట్టణంలోకి మార్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కార్యాలయం పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో వాగుగడ్డ సమీపంలో ఉండడంతో ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల ప్రజలు తమ సమస్యల నివేదన కోసం ప్రతిరోజూ కార్యాలయానికి వస్తుంటారన్నారు. మూడేళ్లుగా సరైన రోడ్డు మార్గం కూడా లేని చోట కార్యాలయం ఉండడం వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో 'పోరుబాట' చేపడతామని హెచ్చరించారు.

తపస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా భునేకర్ సంతోష్ కుమార్

అక్షరటుడే, బాన్సువాడ: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కామారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడిగా భునేకర్ సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు. బాన్సువాడ పట్టణంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. అలాగే తపస్ ప్రధాన కార్యదర్శిగా చాటాపూర్ సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో తపస్ రాష్ట్ర బాధ్యులు రవీంద్రనాథ్ ఆర్య, భాస్కరాచారి, మేక రామచంద్రం, పులగం రాఘవ రెడ్డి పాల్గొని నూతనంగా ఎన్నికైన జిల్లా నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు రాజశేఖర్, లక్ష్మీపతి, ఆంజనేయులుతో పాటు వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎలక్షన్ స్ఫూర్తితో వచ్చే ఎన్నికలకు సిద్ధమవ్వాలి

అక్షరటుడే, బాన్సువాడ: సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారులు ఎక్కువ సంఖ్యలో గెలవడం గర్వకారణమని పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి యెండల లక్ష్మీనారాయణ, జిల్లా ఇన్‌ఛార్జి విక్రంరెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణంలో బీజేపీ నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సన్మానం చేశారు. ప్రజలు బీజేపీపై నమ్మకం ఉంచినట్లు ఈ ఫలితాలు స్పష్టంగా చాటుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మొత్తం ఏడుగురు సర్పంచ్‌లు, ఆరుగురు ఉప సర్పంచ్‌లు, 29 మంది వార్డు మెంబర్లను సన్మానించారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చీదర సాయిలు, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, నాయకులు కొనాల గంగారెడ్డి, మజ్జిగ శ్రీనివాస్, హన్మాండ్లు యాదవ్, రమేష్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మక్కన్న, సాయిలు, చిరంజీవి, ఉమేష్, మహేష్ పాల్గొన్నారు.

రెచ్చిపోయిన దొంగలు.. బంగారం దుకాణాల్లో చోరీ

అక్షరటుడే, బోధన్ : పట్టణం లో దొంగలు రెచ్చిపోయారు. రెండు బంగారం దుకాణాల్లో చోరీ చేశారు. శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న శివ గోల్డ్ సిల్వర్ మర్చంట్ దుకాణాల్లో చోరీ జరిగింది. షట్టర్ తాళాలు పగలగొట్టి దొంగలు లోనికి చొరబడ్డారు. ముగ్గురు వ్యక్తులు చోరీ చేసినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గణితం అంటే భయపడే విద్యార్థులు ఎంతోమంది ఉంటారు. కానీ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా ఏదైనా చేయాలని ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఆలోచించారు. ప్రయోగపూర్వకంగా బోధిస్తే త్వరగా అర్థమవుతుందని భావించి వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. కష్టమైన గణితాన్ని ప్రయోగ పద్ధతిలో విద్యార్థులు తమ ఇష్టమైన సబ్జెక్టుగా మార్చుకునేలా చేసి చూపించారు ఎడపల్లి మండలం ఏఆర్పీ క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. ప్రధానంగా గణిత ఉపాధ్యాయులు సాయిలు చొరవతో ల్యాబ్ ఏర్పాటుచేసి, జిల్లాలో మరో 20 పాఠశాలల్లో సిద్ధం చేసేందుకు నిర్ణయించుకున్నారు. డిసెంబర్ 22న జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని 'అక్షరటుడే' ప్రత్యేక కథనం..

– అక్షరటుడే, ఇందూరు

ప్రయోగంతో గణితం సులభం

■ వినూత్నంగా మ్యాథ్స్ ల్యాబ్‌లు
■ సత్ఫలితాలు ఇస్తున్న ఉపాధ్యాయుల ఆలోచన ■ జాతీయ గణిత దినోత్సవం

గణితాన్ని సాధన చేయడం కంటే ప్రయోగ పద్ధతిలో ముందుకెళ్తే మరింత సులభంగా అర్థమవుతుంది. దీంతో ఈ ప్రయోగ పద్ధతిని అమల్లోకి తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రధానంగా ప్రైవేటు విద్యార్థులకు అనేక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. కానీ ప్రభుత్వ విద్యార్థులకు ఉండవు. ప్రభుత్వ విద్యార్థుల్లోనూ ప్రతిభను వెలుగు తీయడానికే గణిత ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు సాయిలు చెబుతున్నాడు. జిల్లాలోనే ఏఆర్పీ క్యాంప్‌లో మొదటి ప్రయోగశాల ఏర్పాటుకావడం విశేషం.

సందర్శనకు అవకాశం..

పాఠశాలలో ఏర్పాటుచేసిన ఘనత ప్రయోగశాలకు అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థి కృష్ణారెడ్డి ఆర్థికసాయం అందజేశారు. ప్రయోగశాలను జిల్లాలోని ఇతర పాఠశాల్లో విద్యార్థులు సందర్శించేందుకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో గణితం అంటే భయం పోగొట్టేందుకు ఈ సందర్శన ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఇతర మండలంలోని పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

ల్యాబ్‌లో ఏమేం ఉంటాయంటే..

ప్రయోగశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవసరమయ్యే పలు మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా రేఖాగణితం, బీజగణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంఖ్యాగణితానికి సంబంధించిన 125 రకాల బోధనోపకరణాలు అందుబాటులో ఉంచారు. అలాగే విద్యార్థులకు ఉపయోగపడే స్తూపం, శంకువు, కోణం, తదితరు గణిత సామాగ్రిని ప్రయోగశాలలో వినియోగిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఇవీ ప్రయోజనాలు...

- ఈ ప్రయోగాల ద్వారా విద్యార్థులు తరగతి గదిలో పొందిన సైద్ధాంతిక జ్ఞానాన్ని బలోపేతం చేస్తుంది.
- గణిత సూత్రాలను సులువుగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.
- విజువల్స్ మోడల్స్ వినియోగాన్ని సులభతరం చేస్తుంది.
- హ్యాండ్ ఆన్ ఆక్టివిటీస్ గణితాన్ని ఆకర్షణీయంగా మార్చగలవు. సబ్జెక్టుపై మరింత ఆసక్తి పెరిగే అవకాశం ఉంటుంది.

మరిన్ని పాఠశాలల్లో ఏర్పాటు

మూడేళ్ల క్రితం మా పాఠశాలలో గణిత ప్రయోగశాల అందరి సహకారంతో ఏర్పాటు చేశాం. మరో 20 ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి. 2017లో ఎన్‌సీఆర్టీ మైసూర్‌లో నిర్వహించిన గణిత ప్రయోగశాల శిక్షణకు వెళ్లాను. అప్పటినుంచి జిల్లాలోని ప్రతి పాఠశాలలో ప్రయోగశాల ఏర్పాటు చేయాలనేదే నా లక్ష్యం. **– సాయిలు, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు**

మానవత సదన్‌లో విద్యార్థులకు ఉన్ని టోపీల అందజేత

అక్షరటుడే ఇందల్వాయి: శ్రీ కృష్ణ ఫౌండేషన్, హెల్ప్ టు అదర్స్ సంయుక్త ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్‌లో మానవత సదన్‌లో విద్యార్థులకు ఉన్నిటోపీలను అందజేశారు. సుమారు 240మంది విద్యార్థులకు ఉన్నిటోపీలతో పాటు గ్రాఫ్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 'హెల్ప్ టు అదర్స్' స్వచ్ఛంద సంస్థ తెలంగాణ కో-ఆర్డినేటర్ విజయానంద్, శ్రీకృష్ణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలకృష్ణ, మనవతా సదన్ ఇన్‌ఛార్జి రమేష్, డిచ్‌పల్లి బీసీ వసతి గృహం ఇన్‌ఛార్జి దివ్యం, ఫౌండేషన్ సభ్యులు సత్యనారాయణ, రాజేశ్వర్, పవన్ కుమార్, దయాకర్, నరోత్తం రెడ్డి, రాకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగా ఒత్తిడి దూరం..

అక్షరటుడే, బాన్సువాడ: మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, ధ్యానం సరైన మార్గమని యోగా గురువు వొట్టం శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ప్రపంచ ధ్యాన, ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని బాన్సువాడ ప్రభుత్వ ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నేటి జీవన శైలిలో ప్రతిఒక్కరినీ వేధిస్తున్న మానసిక ఒత్తిడిని అధిగమించడానికి ధ్యానమే ప్రధాన మార్గమని తెలిపారు. ప్రశాంతత, చిత్త ఏకాగ్రత సాధించడంలో ధ్యానం కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ధ్యాన సాధనల ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ధృతి శక్తి, స్మరణ శక్తి, మేధాశక్తి వికాసానికి యోగా ప్రక్రియలు ఎంతో ఉపకరిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయభారతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

23న బైక్‌ల వేలం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జప్తు చేసిన 17 బైక్‌లను వేలం వేయన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్‌శాఖ ప్రకటన విడుదల చేసింది. నిజామాబాద్ నగరంలోని శాఖ కార్యాలయంలో ఈ 23వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నారు. ఆసక్తిగల వారు కార్యాలయంలో సంప్రదించవచ్చని శాఖాధికారులు వెల్లడించారు.

ఘనంగా రైతు దినోత్సవం

అక్షరటుడే, ఇందూరు: జిల్లా కేంద్రంలోని గూపన్‌పల్లి శ్రీచైతన్య పాఠశాలలో శనివారం ముందస్తుగా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో భాగంగా చిన్నారులు రైతుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పంటపొలాల్లో పనులు చేస్తూ అబ్బురపర్చారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం మహిపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ స్వప్న, ప్రీప్రైమరీ కోఆర్డినేటర్ సౌజన్య, ఇన్‌ఛార్జి లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సన్మానం

అక్షరటుడే, గాంధారి: మండలంలోని గౌరారం ప్రజల విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు రూ.3.7కోట్ల నిధులు మంజూరయ్యాయి. గ్రామంలో విద్యుత్ సమస్య గురించి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు విన్నవించగా స్పందించిన ఆయన నిధులు మంజూరు చేయించారు. దీంతో ఆదివారం గ్రామస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సబ్ స్టేషన్ ద్వారా వ్యవసాయానికి, గృహ వినియోగానికి, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కానుంది.

కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వైఖరిని మానుకోవాలి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: కాంగ్రెస్ నాయకులు మోసపూరిత వైఖరిని విడిచిపెట్టాలని బీజేపీ లింగంపేట మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గెలిచిన సర్పంచులు కాంగ్రెస్ మద్దతుదారులని పేర్కొనడం సరైంది కాదన్నారు. స్వచ్ఛందంగా గెలిచిన సర్పంచ్‌లను కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి పిలిపించుకుని కండువాలు వేసి తమ పార్టీ మద్దతుదారులని పేర్కొనడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు మహారాజుల మురళి, జక్సాని దత్తు రాములు, అంధ్యాల ఉద్దేశ్, రాజారాం బాలయ్య, ఆకుల విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఆ కుటుంబంలో అంతా ప్రభుత్వ ఉద్యోగులే..

కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం రావడమే ఈరోజుల్లో కష్టం. అలాంటిది నగరంలోని మల్లెగోడ కుటుంబంలో ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులే కావడం విశేషం. నగరంలోని అర్సపల్లికి చెందిన సాయిలు ప్రభుత్వం ఉద్యోగి కాగా.. ఆయన స్ఫూర్తితో ముగ్గురు కుమారులు, కూతురు సైతం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఆయన మూడో కుమారుడు శ్రావణ్‌కు ఇటీవల గ్రూప్–3లో ఉద్యోగం రావడంతో వాళ్లింట్లో అందరూ సర్కారు ఉద్యోగాలు సాధించినట్లయ్యింది.

– అక్షరటుడే, ఇందూరు

■ కష్టపడి చదివి కొలువు సాధించిన అన్నలు, చెల్లెలు ■ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబం

నిజామాబాద్ నగరంలోని అర్సపల్లి ప్రాంతానికి చెందిన మల్లెగోడ సాయిలు వాటర్ లైన్‌మెన్‌గా పనిచేసి దివంగతులయ్యారు. ఆయనకు ముగ్గురు కుమారులు మల్లెగోడ గంగాధర్, గంగాప్రసాద్, శ్రావణ్‌లతో పాటు కుమార్తె గంగాభవాని ఉన్నారు. అయితే మొదటి కుమారుడైన గంగాధర్ ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ చదివాడు. అనంతరం 2011లో ట్రాన్స్‌కోలో జూనియర్ లైన్‌మన్‌గా ఉద్యోగం సాధించాడు. 2016లో ఆయన జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాడు. ఇంట్లో తమ తండ్రి, అన్న సర్కారు కొలువులు సాధించడంతో వారిని స్ఫూర్తిగా తీసుకున్న మిగతా ముగ్గురు సైతం కష్టపడి చదువుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగాలు సాధించారు.

రాష్ట్రపతి నుంచి గోల్డ్‌మెడల్ అందుకుని..

రెండో కుమారుడు గంగాప్రసాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ పీహెచ్‌డీ చేశాడు. రాష్ట్రపతి నుంచి గోల్డ్ మెడల్ అందుకున్నాడు. తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తూ కష్టపడి ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ఈ క్రమంలో 2024లో డిగ్రీ లెక్చరర్ గురుకుల నోటిఫికేషన్‌లో ప్రభుత్వం లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు.

గ్రూప్స్‌లో ఉద్యోగం కోసం..

ఇక మూడో కుమారుడు శ్రావణ్ అర్సపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. ఖిల్లా బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్, జీజీ కళాశాలలో బీఏ డిగ్రీ పూర్తిచేశారు. అనంతరం తన సోదరుల స్ఫూర్తితో ఎలాగైనా సర్కారు కొలువు సాధించాలనే ఉద్దేశంతో గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన గ్రూప్-3లో హోం పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్‌క్వార్టర్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

డిగ్రీలో ఉండగానే వీఆర్ఏగా ఉద్యోగం..

సాయిలు కుమార్తె గంగాభవానీ చదువులో చురుకుగా ఉండేది. 2012లో డిగ్రీ చదువుతూ ఉండగానే ఆమె వీఆర్ఏగా ఎంపికయ్యింది. అనంతరం 2023లో మున్సిపల్ కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసింది. ప్రస్తుతం మోపాల్ మండలంలో జీపీవోగా విధులు నిర్వర్తిస్తోంది. ఇలా సాయిలు కుటుంబంలో అందరూ సర్కారు కొలువులు సాధించారు.